రోగులకు పరీక్ష..!

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

ప్రత్తిపాడులో బుధవారం రాత్రి కురిసిన కుంభవృష్టితో సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) ముంపుబారిన పడింది. ఆసుపత్రి వెనుక ఉన్న మూడు విభాగాలు, వార్డులోకి నీరు చేరడంతో ఉన్నపళంగా రోగులను ఖాళీ చేయించి వేరే వార్డుల్లోకి మార్చారు. కంటి వైద్యం, రక్తపరీక్షల విభాగం, వైద్యుని గదుల్లోకి నీరు చేరి చిత్తడిగా మారింది. సీహెచ్‌సీ వెనుక భాగంలో అదనపు భవన నిర్మాణం జరుగుతోంది. వీటికి సమీపంలోనే ఉన్న కొండమీద నుంచి వచ్చిన నీరు భవనాల మధ్యలోంచి వెళ్లే మార్గం లేక వార్డుల్లోకి చొరబడింది. గురువారం ఉదయానికి నీరు నెమ్మదించినా వార్డుల్లోకి చేరిన బురదను శుభ్రం చేయడం కష్టమైంది. సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య అగ్నిమాపక సిబ్బంది సహకారంతో ఆసుపత్రి వెనుక ముంపు నీటిని ఖాళీ చేయించారు.



సబ్‌స్టేషన్‌లోకి చేరిన ప్రవాహం



ప్రత్తిపాడు సీహెచ్‌సీలోకి నీరు చేరడంతో ఖాళీ చేసిన వార్డు

సబ్‌స్టేషన్‌కు ముంపు షాక్

ప్రత్తిపాడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ యార్డు అంతా వర్షపు నీటితో నిండింది. బ్రేకర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు నీటి తాకిడి తగిలింది. ఈ నీటిని మళ్లించేందుకు ఏడీఏ, ఏఈఈ సిబ్బంది రాత్రంతా శ్రమించారు. దీంతో ప్రత్తిపాడు నియోజకవర్గం, కిర్లంపూడి మండలాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

గుత్తేదారు బెట్టు.. లోగుట్టు

- నీటి పథకాల నిర్వహణకు టెండర్లు వేసి ఒప్పందాలు చేసుకోని వైనం
- ఆరు నెలలుగా పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గ్రామీణ నీటి సరఫరా పథకం(ఆర్‌డబ్ల్యూఎస్)లోని ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి విచిత్రమైన పరిస్థితి నడుస్తోంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందాలకు మాత్రం ముందుకు రావడం లేదు. తమకు లబ్ధి కలిగే విధంగా పైరవీలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తాగునీటి ప్రాజెక్టుల వద్ద నీటి శుద్ధి, మోటార్ల నిర్వహణ, ప్రధాన పైపులైన్ల మరమ్మతులు, కార్మికులకు జీతాల చెల్లింపులు వంటి వాటికి ఏటా గుత్తేదారులను ఖరారు చేస్తుంటారు. మార్చితో ఒప్పంద గడువు ముగిసింది. ఎన్నికల కోడ్‌తో పాతవారినే కొనసాగించారు. జూన్‌లో కోడ్ ముగిసింది. 2024-25 సంవత్సరంలో మిగిలిన కాలానికి పథకాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం చేశారు.



ముమ్మిడివరంలో రక్షిత తాగునీటి ప్రాజెక్టు

అందుకోసమేనా..

రూ.40 లక్షల కంటే ఎక్కువ నిర్వహణ వ్యయం ఉన్న పథకాలకు ఆగస్టులో టెండర్లు ఖరారు చేశారు. చాలామంది పాత గుత్తేదారులు 29 శాతం కంటే తక్కువకు వేసి పనులు దక్కించుకున్నారు. ఒప్పంద పత్రాలు రాసుకుని ఆ మేరకు నిర్వహణ, బిల్లుల చెల్లింపు ప్రక్రియ చేపట్టాలి. పాత ఒప్పందాల ప్రకారం చూసుకుంటే బిల్లుల చెల్లింపుల్లో మేలు జరుగుతుండటంతో కొత్త ప్రక్రియకు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది.

వాటికి ఎప్పుడు మరి..

రూ.40 లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే పథకాలకు ఈఈ స్థాయిలో టెండర్లు పిలిచినా ఇంకా తెరవలేదు. ఈ ప్రాజెక్టుల్లోనూ ఇంకా పాత గుత్తేదారులే కొనసాగుతున్నారు. కార్మికులకు పీఎఫ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు ఉన్నాయి. గుత్తేదారులు ఒప్పందాలకు ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఓ కారణమని తెలుస్తోంది.

మచ్చుకు చూస్తే..

2023-24లో ముమ్మిడివరంలోని సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్వహణకు టెండరు పిలిచారు. ఎస్ఎస్ఆర్ రేట్లకు 0.09 శాతం తక్కువకు గుత్తేదారు దక్కించుకున్నారు. ఇదే ప్రాజెక్టు నిర్వహణకు 2024-25కు సంబంధించి 29.27 శాతం తక్కువకు టెండరు వేసి దక్కించుకున్నారు. పాత టెండరు ప్రకారం నిర్వహణకు రూ.లక్ష చెల్లిస్తే.. కొత్తదాని ప్రకారం రూ.71 వేలు చెల్లించాలి.

సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు	64
గత ఏడాది నిర్వహణ వ్యయం	రూ.35.19 కోట్లు
నిర్వహణ రూ.40 లక్షల కంటే ఎక్కువ ఉన్నవి	35
రూ.40 లక్షల కంటే తక్కువ ఉన్నవి	29

త్వరలో ఖరారు చేస్తాం..

నలభై లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే ప్రాజెక్టులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, ఈనెల 15 నాటికి ఖరారు చేస్తామని కోనసీమ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు. నిర్వహణ వ్యయం రూ.40 లక్షలకు పైబడిన వాటికి కాకినాడలోని ఎస్ఈ స్థాయిలో గుత్తేదారులు అగ్రిమెంట్లు రాయాల్సి ఉందన్నారు. ఇంకా ఒప్పందాలు జరగకపోవడంతో పాత టెండర్ల ప్రకారం చెల్లింపులు చేస్తున్నామన్నారు.



బోనమెత్తి.. భక్తితో కొలిచి

రౌతులపూడి దుర్గాదేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కలశ స్థాపన, కుంకుమపూజలు, అమ్మవారి కీర్తనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేలాది మహిళలు పుర వీధుల్లో బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చారు. బలరామపురం, పి.చామవరం, ఎస్.ఎస్.పట్నం, ములగపూడి, శృంగవరం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోనూ వైభవంగా పూజలు జరిగాయి.

-న్యూస్‌టుడే, రౌతులపూడి

అన్నపూర్ణమ్మ.. అర్చింతుమమ్మా

మహాశక్తి యాగానికి 28 వేల మంది హాజరు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. వేల మంది ముత్తయిదువులు ఏకరూప అరుణవర్ణ చీరలు ధరించి వచ్చి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ గోశాల ప్రాంగణంలో 5 కోట్ల కుంకుమార్చనలు పూర్తి చేశారు. అమ్మవారి వైభవం గురించి పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి వివరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మహాశక్తి యాగం-2024 ప్రారంభించారు. ఈ నెల 13 తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు తొలిరోజైన గురువారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 28 వేల మంది మహిళలు తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు.





కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగానికి హాజరైన భక్తులు.. (అంతరచిత్రంలో) ప్రవచనం చేస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి

విదేశాలకు బియ్యం బళ్లు..
సిద్ధమేనా నిఘా కళ్లు

- తాజాగా పచ్చిబియ్యం ఎగుమతికి పచ్చజెండా
- రేషన్ సరకు తరలకుండా చర్యలు అవసరం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విదేశాలకు నౌకాయానం ద్వారా పచ్చిబియ్యం (రా రైస్) ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత కొన్నాళ్లుగా వీటిని నిలిపివేయగా ఇప్పుడు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఎగుమతులతో కాకినాడ పోర్టు కీలకంగా మారనుంది. ఇక్కడి నుంచి ఏటా లక్షల టన్నుల పచ్చిబియ్యం వెళ్లనున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి మాటున పోర్టును అడ్డాగా చేసుకొని పేదల బియ్యం(పీడీఎస్)ను తరలించారన్న ఆరోపణలున్నాయి. కాకినాడ వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఆయన కుటుంబం, కొందరు ఎగుమతిదారులు దీనివెనుక ఉన్నారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టు పరిసరాల్లోని గోదాముల్లో తనిఖీలు చేశారు. పీడీఎస్ ఆనవాళ్లు ఉన్న 25వేల టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రెండు చెక్‌పోస్టులూ ఏర్పాటుచేశారు. ఇప్పుడు పచ్చిబియ్యం ఎగుమతుల ముసుగులో రేషన్ సరకు తరలించకుండా గట్టి చర్యలు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీల్లో డొల్లతనం..

పోర్టు పరిసరాల్లోని రెండు చెక్‌పోస్టుల వద్ద ఒక్కో టెక్నికల్ అసిస్టెంట్, వీఆర్వో ఉన్నారు. ఉప తహసీల్దార్, ఆర్ఐ..ఆపై ఆర్డీవో, డీఎస్‌వో, డీఎం, కాకినాడ తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుంది. గత రెండు నెలల్లో బియ్యం లోడుతో వెళ్తున్న 26,559 వాహనాలు.. 39 గూడ్స్ రైళ్లకు చెందిన 1,198 వ్యాగన్ల సరకు పరిశీలించారు. బియ్యం నాణ్యత తనిఖీలు సక్రమంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. పోర్టు నుంచి ఇప్పుడు బియ్యం, నూకలు ఎగుమతి అవుతున్నాయి. కొందరు రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చగా 12 50టన్నులు పట్టుకొని కేసులు పెట్టారు.




కాకినాడ పోర్టు సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మూలుగుతున్న అక్రమ నిల్వలు

బాస్మతేతర బియ్యం ఎగుమతులపై కేంద్ర నిషేధం నేపథ్యంలో కొన్ని నెలలుగా కొందరు పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు చేశారు. వీటిని ఇప్పుడు తరలించే అవకాశం ఉంది. పెద్ద ఎగుమతిదారుల్లో ఒకరిద్దరు కాకినాడలోనే ఉన్నారు.

ఏం చేయాలి

■ కాకినాడ దూరంగా పోర్టు ప్రాంతంలో ఈ చెక్‌పోస్టులు ఉన్నందున పోలీసు భద్రత అవసరం. సిబ్బంది సంఖ్యను పెంచాలి ■ ఇతర ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చే బియ్యం లోడులను నిశితంగా తనిఖీ చేయాలి. ■ పోర్టు చెక్‌పోస్టులో గాక కాకినాడకు జాతీయ రహదారి మీదుగా వచ్చే ప్రాంతాల్లోనూ రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాలు, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు దగ్గరలో పరిశీలన చేయాలి.



కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి అయిన బియ్యం ■ లక్షల టన్నులు

మరింత అప్రమత్తం

చెక్‌పోస్టుల వద్ద నిఘాను ముమ్మరం చేస్తాం. అన్ని వాహనాలను తనిఖీ చేశాకే పోర్టులోకి అనుమతిస్తాం. గరిష్ఠంగా రోజుకు 1,199 వాహనాల్లో సరకు తరలించారు. కనిష్ఠంగా ఒక్క వాహనం వచ్చింది. తాజా పరిణామాలతో అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తాం. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ రాత్రిపూట వాహనాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం.

- ఎంవీ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

భూముల అన్యాక్రాంతం.. రైతుల ఆందోళన

లేటరైట్ తవ్వకాలతో పొలాలు దెబ్బతిన్నాయని వెల్లడి

ప్రత్తిపాడు: మైనింగ్ వ్యవహారాల కోసం అవసరమైన రోడ్డుకు తమ భూములు స్వాధీనం చేసుకున్నారంటూ ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలో గురువారం ఆందోళన నిర్వహించారు. వంతాడ సమీప గిరిజనాపురంలో పదేళ్లుగా లేటరైట్ తవ్వకాలు నిర్వహిస్తున్న ఆంధ్రా మినరల్స్ సంస్థ రోడ్డు నిర్మాణానికి భూములను కబ్జా చేసిందని ఆరోపించారు. తవ్వకాల వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, పొలాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. కొంగన కుమారస్వామి, గ్రామానికి చెందిన రైతులు దువ్వా మల్లేశ్వరరావు, సత్యనారాయణ, చిక్కం ధర్మరాజు, పెదకాపు తదితరులు ఈ ఆందోళనకు నాయకత్వం వహించారు. మైనింగ్ రహదారి వేసినపుడు తన భూమిని కబ్జా చేశారని మల్లేశ్వరరావు కాకినాడలో నిర్వహించిన స్పందనలోనూ ఫిర్యాదు చేశారన్నారు. అటవీ భూములను లీజుకు తీసుకుని పర్యావరణానికి ముప్పు తెస్తున్నారన్నారు. రహదారులు దెబ్బతినడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కొండలను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో సహా అంతా పోరాడారన్నారు. తమ ప్రాంతాల్లోని కొండలను కాపాడేందుకు ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. స్పందనలో రైతులు ఇచ్చిన ఫిర్యాదు విషయమై సర్వే చేయిస్తున్నామని ప్రత్తిపాడు తహసీలార్ సూర్యప్రభ పేర్కొన్నారు.



మైనింగ్ ప్రాంతంలో నిలిచిన లారీలు

నిషేధం అమల్లోకి వచ్చినా
ఆగని స్థానచలనాలు

తాజాగా 331 మంది వీఆర్వోలకు బదిలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో బదిలీల ప్రహసనం సాగుతోంది. గతనెల 22 అర్ధరాత్రి 12 గంటల తర్వాత నుంచి సాధారణ బదిలీల ఉత్తర్వులపై నిషేధం అమల్లోకి వచ్చింది. గతనెల 23న జిల్లా రెవెన్యూ శాఖలో ఉప తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు స్థానచలనం కలిగిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇంతటితో ప్రక్రియ ఆగలేదు. పాత తేదీతో తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు వస్తూనే ఉన్నాయి. ఇదేంటంటే పరిపాలనా సౌలభ్యమనే ట్యాగ్ తగిలిస్తున్నారు.

పక్క గ్రామాల్లోనే సర్దుబాటు..

తాజాగా గురువారం 331 మంది (గ్రేడ్-1,2 గ్రామ రెవెన్యూ అధికారులను బదిలీ చేస్తూ కలెక్టరేట్ నుంచి పాత తేదీలతో ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ ఉత్తర్వులు అమల్లో ఉండగా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో గ్రేడ్-1 వీఆర్వో స్థానంలో గ్రేడ్-2 వీఆర్వోలను నియమించారు. గ్రేడ్-1 వీఆర్వోలకు తహసీల్దారు, గ్రేడ్- 2 వీఆర్వోలకు గ్రామ/వార్డు సచివాలయ అడ్మిన్లు డీడీవోలుగా ఉన్నారు. గ్రేడ్-1 వీఆర్వోను బదిలీ చేస్తే అదే క్యాడర్‌లోని అధికారిని అక్కడ నియమించాలి. లేకపోతే వేతనాలు డ్రా చేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఇవేమీ పట్టకుండా ఇష్టానుసారంగా బదిలీలు చేశారు. ఇప్పుడు వీటిని సరిచేసి, తాజాగా అందిన సిఫార్సు లేఖలతో 331 మంది వీఆర్వోలకు స్థానచలనం కలిగించారు. అయిదేళ్ల సర్వీసు ఒకే చోట పూర్తి చేసుకున్నా, ఇతర మండలాలకు పంపకుండా సిఫార్సు లేఖల ఆధారంగా పక్క గ్రామాల్లోనే సర్దుబాటు చేశారు.



కలెక్టరేట్ కార్యాలయం

ఇష్టానుసారంగా నిర్ణయాలు..

తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటికీ వీఆర్వోల బదిలీలు కొలిక్కి రాలేదు. కాకినాడ కలెక్టర్ నోడల్ అధికారిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలి. ఈ ప్రక్రియకు ఎక్కువ గడువు ఇచ్చినా నిర్లక్ష్యం చేసి, ఆఖర్లో ఇష్టానుసారంగా ఉత్తర్వులు ఇచ్చారని పలువురు వీఆర్వోలు వాపోతున్నారు. వాస్తవానికి గత నెల 22తో బదిలీ గడువు ముగిసింది. స్థానచలనం పొందిన అధికారులు, సిబ్బంది ఈనెల 2లోగా విధుల్లో చేరాలి. అయినా కొనసాగుతూనే ఉంది.

కదలని మూలవిరాట్లు

రెవెన్యూశాఖలో బదిలీ అయిన ఉద్యోగులు ఈనెల 2లోగా రిలీవ్ కావాల్సి ఉండగా చాలాచోట్ల పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. కాకినాడ అర్బన్ మండలంలో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసినా ఇప్పటికీ రిలీవ్ కాలేదు. చాలా మండలాల్లో ఇదే పరిస్థితి. అక్కడే కొనసాగేందుకు పైరవీలు చేస్తున్నారు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, భూ సంబంధిత ఫిర్యాదులు పరిష్కారం కావట్లేదు.

ఎప్పటికి పూర్తయ్యేనో..

జిల్లా రెవెన్యూ శాఖలో ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లను గతంలో బదిలీ చేశారు. ఆ ఉత్తర్వులు మార్పు చేసి, వారిని గతంలో పోస్టింగ్ ఇచ్చిన స్థానాల నుంచి కొత్తచోట నియమించారు. ఇతర జిల్లాల్లో నియమించిన వారిని కాకినాడ జిల్లాకు తెచ్చారు. కొందరిని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నియమించారు. ఈ మొత్తం తంతు ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.



అచ్చుతాపురం ఐయాన్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

టెట్‌కు 1,189 మంది హాజరు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) గురువారం ప్రారంభమైంది. జిల్లాలో తొలిరోజు రెండు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. కాకినాడ నగర పరిధి ఎస్.అచ్చుతాపురంలోని ఐయాన్, కాకినాడ గ్రామీణంలోని రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్ కేంద్రాల్లో నిర్వహించారు. ఈ రెండు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం కలిపి 1,333 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. 1,189 మంది రాశారు. 144 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్ష 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు జరిగాయి. అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. తొలి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు తెలిపారు.

ధాన్యం సేకరణకు సమాయత్తం కావాలి

కాకినాడ కలెక్టరేట్: ఖరీఫ్ ధాన్యం సేకరణకు సమాయత్తం కావాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో మార్కెట్‌లోకి వచ్చే ధాన్యం ఎంత..? వరద కారణంగా ఎంత ఉత్పత్తి తగ్గుతుంది..? రైతు సేవా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు సేకరణ, లక్ష్యాలపై సమీక్షించారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సేకరణ, సిబ్బంది, మౌలిక వనరులపై సూచనలు చేశారు. గోనె సంచుల సేకరణ, తేమ యంత్రాల తనిఖీపై ఆరా తీశారు. సీఎంఆర్ కింద గుర్తించిన రైస్‌మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలను 20లోగా సేకరించాలని ఆదేశించారు. గోనె సంచులను మిల్లర్లు సమకూర్చాలని కోరగా.. వారు అంగీకరించారు. నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉన్నందున ఈలోగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. తక్కువ వ్యవధిలో రైతులకు సొమ్ము జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవులనాయక్, డీఎస్‌వో ఎంవీ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, చిత్రంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ, కమిషనర్ భావన

త్వరలో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్ సిద్ధం

కాకినాడ కలెక్టరేట్: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా రాబోయే అయిదేళ్లకు వివిధ రంగాల్లో కాకినాడ జిల్లా 15 శాతానికి మించి స్థూల ఉత్పాదన సాధన లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 2024-29కి సంబంధించి వివిధ రంగాల్లో సాధించాల్సిన ప్రగతిపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థూల ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతున్న 14 ప్రభుత్వ శాఖలపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖల్లో మూడు పంటలు పండించి, రైతుల ఆదాయాన్ని పెంచాలన్నారు. స్థూల ఉత్పత్తిలో 3 శాతంగా ఉన్న పాలు, గుడ్లు, మాంసం ఉత్పాదకతను 8 శాతానికి పెంచాలన్నారు. ఆక్వా రంగం ప్రగతికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాకినాడ నగరంలో కొత్తగా 20 కి.మీ. పొడవున రహదారుల విస్తరణ, 52 కి.మీ. మేర కాలువల వ్యవస్థ పెంచాలన్నారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. దీనికి అనువైన భూములు గుర్తించాలన్నారు. మత్స్యకారులకు బోట్ల మంజూరు, బీమా, ఆయిల్ సబ్సిడీ వంటి అంశాలను కేంద్రానికి నివేదిస్తామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, శిక్షణ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, డీఎఫ్‌వో భరణి, సీపీవో త్రినాథ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీఎస్‌డీటీలు

ఈనాడు కథనానికి స్పందన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల శాఖలో కీలకమైన సీఎస్‌డీటీలు గురువారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా 12 మంది ఉప తహసీల్దార్లను పౌరసరఫరాల శాఖలో నియమించారు. వీరి పూర్వపు స్థానాల నుంచి రిలీవ్ గడువు ముగిసినా కొత్తగా ఇచ్చిన పోస్టుల్లో చేరకపోవడం, మరో పక్క రేషన్ సరకుల పంపిణీ ప్రారంభం కావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనిపై గురువారం 'ఈనాడు'లో '21 మండలాలకు ఇద్దరే' శీర్షికతో ప్రచురితమైన కథనంపై సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా స్పందించారు. సీఎస్‌డీటీలు వెంటనే విధుల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఆరుగురు సీఎస్‌డీటీలు విధుల్లో చేరారు. రెండు, మూడు రోజుల్లో చేరతామని కొంతమంది వివరణ ఇచ్చారు. కొందరు సమాధానం ఇవ్వపోవడంతో చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మట్టి మాట విందాం..

జిల్లాలో చురుగ్గా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సాగులో మెలకువలు, ఆధునిక పద్ధతులు నేర్పించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఉపకరించే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఎట్టకేలకు పునఃప్రారంభమైంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య కాలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ఈ కార్యక్రమాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పునఃప్రారంభించింది. జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. వారంలో మంగళ, బుధవారాల్లో వీటిని నిర్వహిస్తున్నారు.

జిల్లా ముఖచిత్రం

మండలాలు	21
రెవెన్యూ గ్రామాలు	415
రైతు సేవా కేంద్రాలు	414
జిల్లాలో సాగు విస్తీర్ణం	1.24 లక్షల హెక్టార్లు
వరి సాగు	90వేల హెక్టార్లు
రైతులు	1,94,828
సొంత వ్యవసాయదారులు	1,47,457
కౌలుదారులు	47,371

14 శాఖల అనుబంధంగా..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో 14 శాఖలకు చెందిన సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, నీటి పారుదల, డ్రిప్ ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొంటారు. ప్రధానంగా వరి, మినుము, పెసర, చెరవు, మామిడి, ఆయిల్ ఫామ్, కూరగాయలతో పాటు అన్ని రకాల పంటల సాగు విధానాలను వివరిస్తారు.

ఇవీ ప్రయోజనాలు..

భూసారానికి అనుగుణంగా ఏ పంట వేస్తే మంచిది? ఎరువులు ఏ మోతాదులో వాడాలి? వంటి అంశాలు తెలియక ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యలను అధిగమించి, ఆశించిన దిగుబడి సాధించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. నీటి యాజమాన్యం, పురుగు మందులు, ఎరువుల వినియోగం, చీడ, పీడల నివారణ తదితర అంశాలు వివరిస్తున్నారు. భూసారాన్ని పెంచుకోవడం, నీటి వినియోగం, సేంద్రీయ ఎరువుల వాడకం, ఎలుకల నిర్మూలన, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. వారంలో రెండు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సూచించారు.



సామూహిక ఎలుకల నివారణపై అవగాహన

అమ్మా భవానీ.. మనసా స్మరామి


పెద్దాపురం: దుర్గాదేవిగా కాండ్రకోట నూకాలమ్మ


సామర్లకోట: భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరిగా..


గాంధీనగర్: విల్లంబులతో బాలాత్రిపుర సుందరి

అమ్మలగన్నయమ్మ పూజా వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి.. ముగ్గురమ్మల మూలపుటమ్మ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ దసరా శరన్నవరాత్రుల్లో నవదుర్గల అలంకారంలో రోజుకో రూపంతో ఆ పరాశక్తి దర్శనమివ్వనుంది.. అందులో భాగంగా తొలిరోజైన గురువారం ఊరికో అలంకారంతో కనువిందు చేసింది.. నవరాత్రుల దీక్షధారుల జయధ్వానాల నడుమ విశేష పూజలందుకుంది.. కాకినాడ జిల్లాలోని కొన్ని ప్రముఖ ఆలయాల్లో ఆ శక్తి స్వరూపిణి కనువిందు చేసే చిత్రాలివి..

- న్యూస్‌టుడే, కాకినాడ బృందం


పిఠాపురం: విశేషాలంకరణలో పురుహూతికా దేవి


ప్రత్తిపాడు: రాచపల్లి అరుణాచల క్షేత్రంలో బాలాత్రిపురసుందరిగా..


తునిపట్టణం: తునిలో బాలా త్రిపురసుందరిగా వాసవీమాత

అన్నవరంలో రామబాణానికి పూజలు

అన్నవరం, న్యూస్‌టుడే: శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసానికి గుర్తుగా బంగారం, వెండితో అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ తయారుచేయించిన రామబాణానికి అన్నవరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరానికి అందజేసేందుకు ఒక కిలో బంగారం, 13 కిలోల వెండితో మొత్తంగా 14 కిలోగ్రాముల బాణాన్ని చేయించారు. రామభక్తుల దర్శనానికి బాణాన్ని అన్ని పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తున్నారు. ఫౌండేషన్ స్థాపకులు చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అన్నవరం తెచ్చారు. ముందుగా అర్చకులు పూజలు చేసి సత్యదేవుని ప్రధానాలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల అనంతరం క్షేత్ర పాలకులు సీతారాముల వారి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు రామబాణాన్ని దర్శించుకున్నారు.


పూజలు చేస్తున్న వైదిక బృందం

డ్వాక్రా మహిళలకు గృహ రుణాలు ఇప్పించాలి

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని పేదలకు యు.కొత్తపల్లి మండలం, కొమరగిరి లే-ఔట్‌లో ఇచ్చిన స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టామని, లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు బ్యాంకుల నుంచి మంజూరు చేసిన రుణాల సొమ్ము ఇప్పించాలని లేబర్ ఏజెన్సీల ప్రతినిధులు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ ఇళ్ల స్థలాలు పొందిన డ్వాక్రా మహిళలకు గృహాలు నిర్మించేందుకు ఒక్కొక్కరికి రూ.35వేలు చొప్పున రుణాలు మంజూరు చేశారని, సుమారు రూ.8కోట్లు గృహనిర్మాణ సంస్థ, నగరపాలక సంస్థ వద్ద ఉన్నాయని, వీటిని ఇప్పించాలన్నారు. సుమారు 2వేల ఇళ్లకు పునాదులు పూర్తయ్యాయని, సొమ్ములు లేక పనులు జరగట్లేదన్నారు. వీటిని లేబర్ ఏజెన్సీలకు ఇవ్వాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తర్వులిచ్చిందని, బిల్లులు ఇప్పించాలన్నారు. పేదల గృహనిర్మాణాలకు వినియోగించే గ్రావెల్, కంకర, ఇటుకలకు సీనరేజ్ వసూలు చేస్తున్నారని, దీంతో ఒక్కో ఇంటికి అదనంగా పడుతున్న రూ.12వేల భారాన్ని మినహాయించాలన్నారు.

ఇలా చేస్తే మీ ఇంట్లో చోరీ జరగదు..!

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో పక్కాగా రక్షణ

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

దొంగతనాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసుశాఖ 2017లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ప్రారంభించారు. సాంకేతికతతో నేరాలు అదుపు చేసేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది. కానీ ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ప్రారంభించి ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటివరకూ తక్కువ మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవుల నేపథ్యంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పోలీస్ శాఖ సూచిస్తోంది. ఇటీవల కాలంలో ఇంటి దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో దీనిని వినియోగించుకోవడం ద్వారా చోరీలను అదుపుచేయవచ్చని పోలీసులు చెబుతున్నారు.

సంవత్సరం	ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగదారులు	చోరీల సంఖ్య
2022	60	132
2023	42	112
2024	14	71 (ఇప్పటి వరకు)

వినియోగం ఇలా..



గూగుల్ స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్ నంబరు, చిరునామాతో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ పూర్తవగానే వచ్చే ఐడీ భద్రపరుచుకోవాలి. ఊరు వెళ్లాల్సిన సందర్భంలో యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీ నమోదు చేసి వెళ్లే, తిరిగి వచ్చే సమయాలను టైప్ చేసి రిక్వెస్ట్ పోలీసు వాచ్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. సమాచారం అందుకున్న కంట్రోల్ రూం పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో వచ్చిన చిరునామాలో వైఫై రూటర్, సెన్సార్‌తో పనిచేసే మోషన్ కెమెరాలు, విద్యుత్తు పోయినా పనిచేసేలా యూపీఎస్ ఏర్పాటుచేసి, కంట్రోల్ రూమ్‌కి అనుసంధానిస్తారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి అపరిచితులు ప్రవేశించడానికి ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా ఫోటోలు తీయడంతోపాటు అలారం ద్వారా కంట్రోల్ రూం, స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకునే అవకాశం ఉంది. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు కావాల్సిన వారు కాకినాడ పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్లు 94907 63489 లేదా 112కు ఫోన్ చేసి ఉచిత సేవలు పొందవచ్చన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై జిల్లా ప్రజలకు పోలీసు యంత్రాంగం అవగాహన కల్పిస్తున్నారు.

సాంకేతిక అవసరాన్ని గుర్తించాలి..



ఇంటికి తాళాలు వేసి బయట ఊర్లకు వెళ్లే వారంతా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలి. తద్వారా చోరీలకు పాల్పడే నిందితులను గుర్తించవచ్చు. నేరాల నియంత్రణలో సాంకేతికత అవసరాన్ని ప్రజలు గుర్తించి వినియోగించుకోవాలి. దొంగతనాలు జరిగినా నిందితులను వెంటనే అరెస్ట్ చేస్తారనే భరోసా ప్రజలు కలిగి ఉండాలి. నేరాలకు పాల్పడితే దొరికిపోతామని భయం నిందితుల్లో ఉండాలి.

- విక్రాంత్ పాటిల్, కాకినాడ జిల్లా ఎస్పీ

కోస్తా రైలు మార్గానికి వినతి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కోస్తా రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు వైడీ రామారావు రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రైల్వే సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో విజయవాడలో శుక్రవారం బోర్డు సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో వైడీ రామారావు గురువారం మాట్లాడారు. కోస్తా తీరంలో వ్యవసాయ, పారిశ్రామిక, నౌక వాణిజ్యం, గ్యాస్, పెట్రోలియం, సముద్ర, జల ఉత్పత్తుల కేంద్రంగా ఉన్న గోదావరి కృష్ణా పరివాహక ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. పోర్టు అభివృద్ధితో పాటు వ్యవసాయ, వాణిజ పంటల రవాణా సులభతరం అవుతుందన్నారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

నడుము, మోకాళ్ల నొప్పులకు ప్రత్యేక విభాగం

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని ఎముకల వైద్య విభాగంలో 24గంటల ఆపరేషన్ థియేటర్ ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా నడుము, మోకాళ్ల నొప్పులు, పుట్టుకతో వచ్చే పాదాల వంకర్లకు ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి గురువారం దీన్ని ప్రారంభించారు. డీఎంఈ డా.నరసింహం సూచనల మేరకు ఆయా విభాగాల్లోని నిపుణులతో వైద్యం అందిస్తామని ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డా.పాండురంగ విఠల్ తెలిపారు. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.పార్థసారధి, డా.ముఖర్జీ, డా.వింధ్య, డా.ప్రసన్న, డా.రామ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో క్లినిక్ ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఎన్.శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.


రత్నగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా గురువారం ప్రారంభమయ్యాయి. అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆసీనులను చేసి వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కలశస్థాపన చేసి పారాయణ, లింగార్చన, సూర్యనమస్కారాలు, జపాలు తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన చేశారు. దేవస్థానం ఛైర్మన్ ఐ.వి. రోహిత్ పూజల్లో పాల్గొని రుత్విక్కులకు దీక్షా వస్త్రాలు అందించారు. క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను బాల త్రిపుర సుందరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరిస్తారు. ఈ నెల 12న విజయదశమి సందర్భంగా పూర్ణాహుతి, సాయంత్రం గజవాహనసేవ, శమీ పూజ, రావణ సంహారం తదితర కార్యక్రమం జరగనున్నాయి.


పూజలు చేస్తున్న వైదిక బృందం, పాల్గొన్న ఛైర్మన్ రోహిత్

ఎన్‌ఆర్‌ఐ సంఘం విరాళం

గాంధీనగర్: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కాకినాడ నగర ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ సంఘం రూ.3.70 లక్షల విరాళం ఇచ్చింది. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేసినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. సంఘ అధ్యక్షుడు పాలడుగు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు వైడీ.రామారావు, కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి రామనాథం పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుకు విరాళ పత్రం అందిస్తున్న దాతలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-35 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

మంత్రి లోకేశ్‌ను కలిసిన చినరాజప్ప

పెద్దాపురం, న్యూస్‌టుడే: విజయవాడలో విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆయన మాట్లాడారు. వెంట ఎమ్మెల్యే తనయుడు, తెదేపా నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ తదితరులు ఉన్నారు.



వన్యప్రాణుల సంరక్షణపై పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌వో ఎస్.భరణి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం కాకినాడ వివేకానంద పార్కులోని గ్రంథాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణ, మానవులతో పాటు స్వేచ్ఛగా వాటి ఆవాసానికి అవసరమైన చర్యలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

ఉచిత వినికిడి పరీక్షలు.. పరికరాలు

మసీదు సెంటర్ (కాకినాడ): వినికిడి సమస్య ఉన్న వాళ్లకు కాకినాడ జీజీహెచ్‌లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ గురువారం తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఈ సమస్య బాధపడుతుంటే ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. వినికిడి పరికరాలు అవసరమైన వారికి శ్రవణ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఇస్తామన్నారు. బాధితులు జీజీహెచ్‌లోని డైస్ డిపార్ట్‌మెంట్, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీ సెక్షన్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.ప్రభాకర్, డైస్ సిబ్బంది, శ్రవణ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో బాధిత చిన్నారులతో వైద్యాధికారులు

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా రేణుక

మసీదు సెంటర్(కాకినాడ): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా వి.రేణుక గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా జోనల్ మేనేజర్ ఏపీబీసీఎల్ నుంచి కాకినాడ అసిస్టెంట్ కమిషనర్‌గా వచ్చారు. ఆమెను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.జయ మౌనిక, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రేణుక కాకినాడ నార్త్ ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

వైకాపా నాయకుడి భవనంలో జూద శిబిరం..?

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జూద శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని రామారావుపేట జిల్లా పరిషత్తు అతిథి గృహం ఎదురుగా నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనంలో జూదం ఆడుతున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం వచ్చింది. ఆ మేరకు క్రైం సీఐ వి.కృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు రెండు ఆటోల్లో వచ్చి దాడి చేశారు. ఆ భవనం నగరానికి చెందిన ఓ వైకాపా నేతదిగా సమాచారం. రూ.15,35,100 నగదు స్వాధీనం చేసుకుని, 21 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో ప్రముఖ న్యాయవాది ఉన్నట్లు చెబుతున్నారు. సంబంధిత వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. తరచూ ఇక్కడకు ఎంతోమంది వచ్చి జూదం ఆడుతుంటారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కేసు నమోదైంది.


నిర్మాణంలో భవనం

పర్యాటక కేంద్రంగా లోవ అభివృద్ధికి చర్యలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. గురువారం దేవస్థానంలో దసరా ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. లోవ దేవస్థానానికి ప్రస్తుతం ఏటా రూ.9 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. పెరుగుతున్న భక్తుల సౌకర్యార్థం పాలకమండలి సూచనల మేరకు దేవస్థానం దిగువన సుమారు 50 ఎకరాల భూమిని సేకరించి పార్కింగ్, వసతి గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఆలయానికి రావడానికి వీలుగా తాళ్లూరు గ్రామం మీదుగా రెండో రహదారి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. దీంతో దేవస్థానం సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయడంతోపాటు భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు నిధులు సమకూర్చేందుకు కేంద్రం, రాష్ట్ర పర్యాటక శాఖలకు ప్రతిపాదనలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయానికి వచ్చే వృద్ధులు, చిన్నారులు కొండపైన ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు అనువుగా ఎస్కలేటర్ ఏర్పాటుకు అధికారులు చొరవచూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ గొర్లి అచ్చినాయుడు, మాజీ ఛైర్మన్లు దూలం మాణిక్యం, కరపా అప్పారావు, పార్టీ నాయకులు సుర్ల లోవరాజు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి యనమల

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం కొడవలి శివారు పుష్కర కాలువలో గల్లంతైన ముప్పనబోయిన సతీష్(15) మృతదేహం గురువారం ఉదయం లభ్యమైనట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సతీష్ బుధవారం ఉదయం బహిర్భూమికి పుష్కరకాలువ దగ్గరకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. కాలువలో సతీష్ పాదరక్షలు కనిపించడంతో ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతైనట్లు భావించి పోలీసులకు సమాచారం అందించారు. పుష్కర కాలువలో ఈతగాళ్లు గాలించినా నీటి ప్రవాహ తీవ్రతతో జాడ తెలియలేదు. పుష్కరకాలువ నీటిలో తేలుతూ సతీష్ మృతదేహం కనిపించడంతో స్థానికులు సమాచారం అందించడంతో వెలికితీశారు. బాలుడి తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

దూసుకెళ్లిన బస్సు చక్రం.. ఒకరికి గాయాలు

తాళ్లరేవు: అమలాపురం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం జార్జిపేట ఎంఎల్‌కే నగర్ వద్ద ఊడిపోయింది. బస్సు కొంత దూరం వెళ్లి ఆగింది. ఆ చక్రం 100 మీటర్లు దూసుకెళ్లి రోడ్డు పక్కన మాట్లాడుకుంటున్న ఇద్దరిలో ఒకరిని ఢీకొంది. ఆ ప్రమాదంలో చెల్లెవారిపేటకు చెందిన మున్రే గాంధీ కాలు, చేతులు, తలకు గాయలయ్యాయి. ఆయనను తొలుత యానాం, అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన గాంధీ



ఊడిన బస్సు చక్రాన్ని బిగిస్తున్న ఆర్టీసీ మెకానిక్‌లు

డీఈవోకు అస్వస్థత

కాకినాడ నగరం: కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) పి.రమేష్ అస్వస్థతకు గురయ్యారు. కలెక్టరేట్‌లో గురువారం ఉదయం స్వచ్ఛంధ్ర కార్యక్రమాలపై కలెక్టర్ షాన్ మోహన్ సమీక్షిస్తుండగా రమేష్‌కు ఫిట్స్ వచ్చాయి. కుప్పకూలిపోయిన ఆయనకు అక్కడే ఉన్న డీఎంహెచ్‌వో నరసింహానాయక్, తదితరులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించి అత్యవసర విభాగంలో వైద్య సేవలందించారు. సాయంత్రానికి సర్పవరం జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి కోలుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మెట్టకు 700 క్యూసెక్కుల సాగునీరు

సీతానగరం: గోదావరి ఎడమగట్టున సీతానగరం మండలంలోని పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా తూర్పు, కాకినాడ జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల కోసం గురువారం నీటిని విడుదల చేశారు. 18 మండలాల్లో సాగునీటి అవసరాలకు గాను 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. ఏలేరు జలాశయంలో అదనపు నిల్వలు ఉండటం వల్ల పోలవరం ఎడమ ప్రధానకాలువ నుంచి సాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశామన్నారు. గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుతోందన్నారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 38,40, వంకాయలు - 40,50,60, బెండకాయలు - 40, పచ్చిమిర్చి - 30,35, కాకరకాయ - 44, బీర - 40,46, కాలీఫ్లవర్ - 20,25, క్యాబేజీ - 34, క్యారెట్ - 56, దొండకాయలు - 50, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 51,55, గోరుచిక్కుళ్లు - 40, దోసకాయలు - 30, ఆనబకాయ - 25,30, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 84, చేమదుంపలు - 40, మునగకాడలు - 12,15, బీట్‌రూట్ - 38, కీరదోస - 28, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 74, బొబ్బర్లు - 42, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,60.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, దక్షిణ, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, కాళీ, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సిఅండ్‌సీ 1- మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - రామ్‌నగర్ బన్నీ, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- మిస్టర్ సెలబ్రిటీ, శ్రీశ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.

తాగి వాహనం నడిపినందుకు రూ.10 వేలు జరిమానా

మసీదు సెంటర్(కాకినాడ): ఎస్పీ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1,2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపిన 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐలు ఎన్. రమేష్, డి. రామారావు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒకరికి మూడురోజుల జైలు, ముగ్గురికి రెండు రోజుల జైలు, 11 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి. నరసింహారావు గురువారం ఈ తీర్పు చెప్పారు.

విద్యాబాధ్యతలు తీసుకున్న 'శ్రీయువసేన'

గాంధీనగర్, న్యూస్‌టుడే: తండ్రిని కోల్పోయిన మరో ముగ్గురు చిన్నారుల విద్యాబాధ్యతలను శ్రీయువసేన తీసుకుంది. రామచంద్రపురం నియోజకవర్గం గొల్లపాలెంనకు చెందిన కె. చెన్నకేశవ 2020లో కరోనా కారణంగా మృతిచెందారు. ఆయన కుమారుడు జశ్వంత్ విద్యా బాధ్యతను శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్ తీసుకున్నారు. అలాగే గొల్లపాలెంనకు చెందిన యు. ఈశ్వరరావు గతనెల గుండెపోటుతో మృతిచెందారు. అతని ఇద్దరు పిల్లలు లీల, సురేష్‌ల చదువు బాధ్యతనూ శ్రీయువసేన తీసుకుంది. ఈ సందర్భంగా గురువారం మెయిన్‌రోడ్డులోని శ్రీయువసేన బ్లడ్‌బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో సతీష్ మాట్లాడారు. ఇప్పటి వరకూ 72 మంది విద్యాబాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి పిల్లలను తమ సంస్థ ద్వారా సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణరెడ్డి చదివించనున్నట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే పేద విద్యార్థులకు అవసరమైన జీకే, జనరల్ స్టడీస్, అర్థమెటిక్, ఆంగ్ల పుస్తకాలను సానా సతీష్‌బాబు ఫౌండేషన్ తరఫున అందించామని ఛైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. గురువారం కాకినాడ సెంట్రల్ లైబ్రరీలో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని గ్రంథాలయ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. హరీష్ చేతులమీదుగా అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభ్యులు మంగా వెంకట శివరామ కృష్ణ, మణికంఠ, చార్లీ, సెంట్రల్ లైబ్రరీ సహాయ కార్యదర్శి కిషోర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా వారి.. చెత్త పన్ను కథ

ప్రజలపై రూ.19 కోట్ల బాదుడు

గత వైకాపా ప్రభుత్వంలో చెత్త పన్ను పేరుతో ప్రజలపై బాదేశారు. రెండేళ్లలో నగరపాలక సంస్థలో రూ.19కోట్లు ముక్కుపిండి వసూలు చేశారు. దీనిపై సామాన్యులు గగ్గోలు పెట్టారు. చెత్త పన్ను రద్దు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు రద్దు చేస్తూ తాజాగా ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వులు రావాల్సి ఉండగా అంతటా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

అలా మొదలైంది..

నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణను 2021 డిసెంబరు వరకు అప్పటి మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ సమర్థంగా అమలు చేశారు. వ్యర్థాల నిల్వకు ఇంటికి మూడు రకాల డబ్బాలు పంపిణీ చేశారు. ప్రతీ సచివాలయం పరిధిలో మైక్రో ప్యాకెట్లు పెట్టి, 60 లీటర్ల సామర్థ్యం ఉన్న డబ్బాలతో చెత్త వేరుగా సేకరించేవారు. డివిజన్ల వారీగా చెత్త ట్రాన్స్‌ఫర్ పాయింట్లు పెట్టారు. ఇక్కడి చెత్తను, డంపర బిన్నుల్లో నిల్వ చేసి ట్రాక్టర్లు, కాంపెక్టర్లలో తరలించేవారు. అంతా బాగున్నా 2022 జనవరిలో హూపర్ టిప్పర్ వాహనాలను తెచ్చారు. ఇప్పుడవీ ఆగిపోయాయి. అయిదు కాంపెక్టర్ వాహనాలు మూలకు చేరాయి.



యార్డులో నిలిచిన హూపర్ టిప్పర్ వాహనాలు

ఇలా ఆగిపోయింది..

2022 జనవరిలో నగరపాలక సంస్థకు హూపర్ టిప్పర్ వాహనాలు వచ్చాయి. 105 వాహనాలకు నెలకు రూ. 56 లక్షల చొప్పున నిర్వహణ ఛార్జీలు చెల్లించడానికి ఒప్పందం జరిగింది. నగరపాలక సంస్థలో 87 అసెస్‌మెంట్స్ (డొమెస్టిక్, కమర్షియల్) ఉన్నాయి. వీటితో ప్రతి నెలా రూ. 72లక్షలు వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. పేదలవాడల్లో నెలకు రూ. 60, మిగతా ప్రాంతాల్లో రూ. 90, ఆసుపత్రులు, కల్యాణ మండపాలు, ఇతర వాణిజ్య సంస్థలకు నెలకు గరిష్ఠంగా రూ. 10వేల వరకు ఒక్కో అసెస్‌మెంట్ నుంచి వసూలుకు నిర్ణయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో పేదలవాడల్లో రూ. 30కే పరిమితం చేశారు. వీటి ద్వారా తగ్గిన వసూళ్లను వాణిజ్య అసెస్‌మెంట్స్‌పై మోపారు. కాకినాడ నగర ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు జనవరి నుంచి పన్ను వసూలు ఆపేశారు.

మధ్యలో దోపిడీ..

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ పేరుతో ప్రైవేటు సంస్థకు చెందిన 105 హూపర్ టిప్పర్ వాహనాలను అంటగట్టి స్వచ్ఛత పేరుతో దోచిపెట్టారు. వసూలు చేసిన చెత్త పన్నును వైకాపా ప్రభుత్వం దారిమళ్లించి, ప్రైవేటు సంస్థకు బిల్లులు చెల్లించలేదు. రూ. 5కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ప్రభుత్వ, నగరపాలక సంస్థ ఖజానాకు గండికొట్టేలా చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో నెల రోజులుగా 105 హూపర్ టిప్పర్ వాహనాలు యార్డుకే పరిమితమయ్యాయి. ఈ వాహన ఒప్పందం 2026 సెప్టెంబరు వరకు ఉంది. అది కొనసాగిస్తే ప్రభుత్వంపై మరో రూ. 14కోట్లు భారం పడుతుంది. ఈ క్రమంలో ఏం చేయనున్నారనేది ప్రభుత్వ ఉత్తర్వులపై ఆధారపడి ఉంది.

చర్యలు తీసుకుంటాం..

నగరంలో చెత్త సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కాంపెక్టర్ వాహనాలను మరమ్మతులకు పంపించాం. 60 లీటర్ల డబ్బాలు కొనేందుకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం హూపర్ టిప్పర్ వాహనాలు నిలిచిపోయాయి. చెత్త పన్ను రద్దు ఉత్తర్వులు ఇంకా రాలేదు. వచ్చాక.. చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ డి.పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ

అలరించిన కళారావాలు

గాంధీనగర్: దసరా సందర్భంగా నగరంలోని ఆలయాలు, సంస్థల నేతృత్వంలో జరిగిన సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులు, సంగీత ప్రియులను ఆకట్టుకున్నాయి. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో జరిగిన వేడుకల్లో కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఉచిత ప్రసాద వితరణ ప్రారంభించారు. చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. సరస్వతి గానసభ 121వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాలు గురువారం సాయంత్రం సూర్యకళా మందిరంలో ప్రారంభమయ్యాయి. 6వ తేదీ వరకు ప్రతీరోజూ సాయంత్రం సంగీత, నృత్య కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజు హైదరాబాద్‌కు చెందిన వడలి ఫణి నారాయణ్‌చే వీణానాద కచేరి జరిగింది. పలువురు వాగ్గేయకారుల కృతులు, రాగాలు ఆలపించారు.



చిన్నారుల భరతనాట్య ప్రదర్శన

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాకినాడ కలెక్టరేట్: నగరంలో పవర్‌హౌస్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎన్. ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు కొమ్మిరెడ్డివారి వీధి, పీఆర్ కళాశాల రోడ్డు, అవసరాలవారి వీధి, పిండిప్రోలువారి వీధి, నూకాలమ్మగుడి, గోపాలకృష్ణవీధి, దంటువారి వీధి, రామారావుపేట, పశువుల ఆసుపత్రి ప్రాంతం, శేషసాయివీధి, సాంబమూర్తి వీధి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.



భానుగుడి శివాలయంలో



ఆర్టీసీకాంప్లెక్స్ ఎదురుగా దేవస్థానంలో..



అయ్యప్పస్వామి ఆలయంలో..



అశోక్‌నగర్ శిర్డీసాయి ఆలయంలో

అమృత వర్షిణి.. ఆనంద రూపిణి

గాంధీనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నగరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ఉదయం కలశ స్థాపన అనంతరం పుణ్యాహవచనం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, చండీహోమం జరిగాయి. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రంధి బాబ్జి, నేమాని సత్యనారాయణ, నగర తెదేపా అధ్యక్షుడు వీరు తదితరులు పాల్గొన్నారు. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. సంతచెరువు వద్ద గల కనకదుర్గాదేవి ఆలయంలో విశేష పూజలు చేశారు. సినిమారోడ్డులోని శ్రీకామాక్షి అమ్మవారి 13వ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రైల్వేకాలనీలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో కలశస్థాపన, మండపారాధన, అమ్మవారికి అభిషేకం జరిగాయి. డాల్ఫిన్ కాలనీలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భాజపా రాష్ట్ర అధికార ప్రతనిధి యెనిమిరెడ్డి మాలకొండయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. రాజాజీవీధిలో శ్రీదేవి యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో నవావరణార్చన, కుంకుమార్చనలు జరిగాయి. జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల ఆలయంలో అమ్మవారు స్వర్ణకవచాలంకృత అవతారంలో దర్శనమిచ్చారు. భానుగుడి సెంటర్‌లోని బాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు.



బాలాత్రిపుర సుందరి ఆలయంలో ఎమ్మెల్యే వనమాడి



పెద్ద శివాలయంలో బాలాత్రిపుర సుందరి

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక పరవశం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠం వేల మంది భక్తులతో కిక్కిరిసింది. ఐశ్వర్యాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా కొలువయ్యారు. పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో మహాశక్తియాగం-2024 ఉత్సవాలు ప్రతి మదిలో ఆధ్యాత్మిక పరవశం నింపాయి. గురువారం మొదటిరోజు అమ్మవారి ఆలయ గోశాల ప్రాంగణం అష్టోత్తరనామాలతో ధ్వనించింది. హరిత సోదరీమణుల సంగీత కచేరీ అలరించింది. సుమారు 50 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.

13న సూర్యకాంతం శతజయంతి సభ

గాంధీనగర్, న్యూస్‌టుడే: మహానటి సూర్యకాంతం శతజయంతి సభను ఆదివారం సాయంత్రం దంటు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు తెలిపారు. కళాక్షేత్రంలో గురువారం కార్యక్రమ ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హాజరవుతారన్నారు. సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారాన్ని సీనియర్ నటీమణి డబ్బింగ్ జానకికి ఇవ్వనున్నట్లు తెలిపారు. కళారత్న మీగడ రామలింగస్వామి సంగీత నవావధానం ఉంటుందన్నారు. ఆత్మీయ అతిథులుగా చెన్నై నుంచి సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, కాకినాడ సీపోర్టు సీఓఓ మెర్ల మురళీధర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐవీ. రావు, వాడ్రేవు రవి, నాటకరంగ పరిశోధకులు కందిమళ్ల సాంబశివరావులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యనిర్వాహక సభ్యుడు పివి. రావు, సీతారామ్, ఎం. విశ్వేశ్వరరావు, కె. కృష్ణారావు, పట్నాల రాము, మార్ని జానకిరామ్ చౌదరి, ఓవిఎన్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను పోరాటాలతో కాపాడుకుంటామని రైతు, మహిళా సంఘాల ప్రతినిధులు ప్రతినబూనారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, సొంత గనుల కేటాయింపు అంశాలపై రెండు రోజులుగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చెక్కల రాజ్‌కుమార్, తోకల ప్రసాద్ ప్రారంభించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్త రాజశేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి కె. వరలక్ష్మి, రైతు, మహిళా సంఘాల ప్రతినిధులు కేవేస్ శ్రీనివాస్, అప్పారెడ్డి, వి. చంద్రరావు, వెంకటసుబ్బిరెడ్డి, ఉప్పాడ సత్యనారాయణ, ఎస్. గంగాభవానీ, భూలక్ష్మి, చంద్రమళ్ల పద్మ, తదితరులు కూర్చున్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోడానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆంధ్రా ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



శిబిరంలో రైతు, మహిళా సంఘాల ప్రతినిధులు

తపాలాశాఖ ఉత్తరాల పోటీ

గాంధీనగర్: తపాలా శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ది జాయ్ ఆఫ్ రైటింగ్: ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ డివిజినల్ పోస్టల్ సూపరిండెంటెంట్ చుక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 14 వరకు జరిగే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. 18 ఏళ్ల లోపు వారికి, పైబడిన వారికి వేర్వేరుగా ఉంటాయన్నారు. ఎన్వలప్, ఇన్లాండ్ లెటర్ విభాగాల్లో జరుగుతాయన్నారు.

బస్‌స్టేషన్ మేనేజర్‌గా శ్రీనివాసరావు

సాంబమూర్తినగర్: కాకినాడ ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్‌గా వల్లెం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన గతంలో ఇక్కడి డిపో గ్యారేజ్‌లోనే ఆయిల్ డీసీ నిర్వహణ బాధ్యతలు చూసేవారు. ఇంతవరకు స్టేషన్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్ 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఖాళీ అయిన స్థానంలో శ్రీనివాసరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ఫ్లెక్సీలు తొలగించాలని నిరసన

కాకినాడ కలెక్టరేట్: నగరంలో ఫ్రీ ఫ్లెక్సీ సిటీ అమలుకు మూడు నెలల కిందట కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద కాకినాడ నగర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు నిరసన తెలిపారు. నగరపాలక సంస్థ ఆస్తులు, వీధి దీపాలకు రహదారుల చెంతన ఇష్టారీతిన ఫ్లెక్సీలో, బ్యానర్లు, హోర్డింగ్‌లు అనధికారికంగా ఏర్పాటు చేస్తున్నారని, వీటితో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారని, వెంటనే వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం

సాంబమూర్తినగర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌లో విధులు నిర్వహించే పారిశుద్ధ్య సిబ్బందిని గురువారం సన్మానించారు. డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిబ్బందిని అభినందించి వారికి నగదు బహుమతి అందజేశారు. టి. బాలకృష్ణ, వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

దీపాలు వెలిగాయోచ్



స్పందనకు వందనం

మసీదు సెంటర్: భాస్కర్‌నగర్ కూడలి, వెంకట్‌నగర్, రామకృష్ణారావుపేట తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా వీధిదీపాలు వెలగట్లేదు. దీనిపై ఈనెల 1న 'ఈనాడు'లో 'అలముకున్న చీకట్లు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు. భాస్కర్‌నగర్ కూడలి వద్ద దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

చెత్త తీయట్లేదు..




సమస్య: జగన్నాథపురం చిన్న మార్కెట్ వద్ద అయ్యర్ హోటల్ ఎదురుగా చెత్త పేరుకుపోయింది. ఎండు కొమ్మలతోపాటు చెత్తను పదిరోజులుగా తరలించడం లేదు. దుర్వాసన వస్తోంది. -స్థానికులు, జగన్నాథపురం

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.

- వైఆర్‌ఎల్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నగరపాలకసంస్థ

ఖాళీ స్థలంతో ఇబ్బందులు..



సమస్య: సురేష్‌నగర్ 6వీ వీధిలో 70-15-101/డి నంబరు గల ఇంటి సమీపంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. అందులోంచి పాములు, విష కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయి. - స్థానికులు, సురేష్‌నగర్

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- డా.పృథ్వీచరణ్, ఎంహెచ్‌ఓ, నగరపాలకసంస్థ

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు:
సాంబమూర్తినగర్: 91548 46719

అడవి కాదు.. ఆటస్థలమే..

దర్పణం

పేరు: నగరపాలక ఉద్యానం
ప్రాంతాలు: సురేష్‌నగర్, శశికాంత్ నగర్, గొడారిగుంట, ఆర్‌ఆర్‌నగర్, శాస్త్రీ నగర్
రోజూ వచ్చేవారు: 200 మంది
ఆదివారం వచ్చేవారు: 500 మంది
అభివృద్ధికి చేశామన్న ఖర్చు: సుమారు రూ.35 లక్షలు

ఉద్యానాల అభివృద్ధికి రూ. లక్షలు ఖర్చు చేస్తున్నామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. వాటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించట్లేదు. 3వ డివిజన్ పరిధిలో సురేష్‌నగర్‌లో సుమారు అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఇండోర్ స్టేడియంతో పాటు నగరపాలక ఉద్యానం ఉంది. ఆడుకునేందుకు, నడక, వ్యాయామం కోసం రోజూ వందలమంది ఇక్కడకు వస్తుంటారు. సరైన నిర్వహణ లేకపోవడంతో ఉద్యానమంతా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది. కొన్ని నెలల కిందట ఉద్యానంలో కొంతమేర పిచ్చి మొక్కలు తొలగించి అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగి సర్పాలకు, విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. నడక దారి సైతం మూసుకుపోవడంతో నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. స్టేడియం వెనుక ఆనుకుని నివసించే వారు వ్యర్థాలను ఉద్యానం వైపు పడేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. పూర్తిస్థాయిలో విద్యుత్తు దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంటోంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఇక్కడ నాలుగు హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని సందర్శకులు చెబుతున్నారు. ఉద్యానం, స్టేడియం చుట్టూ శిథిలాలు, నిర్మాణ సామగ్రి ఉన్నాయి. చినుకు పడితే నీరు నిలిచిపోతుంది. సమస్యల పరిష్కారం కోరుతూ సురేష్‌నగర్, శాస్త్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇటీవల కమిషనర్ భావనకు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్



ఉద్యానంలో పెరిగిన పిచ్చిమొక్కలు



స్టేడియం ఆవరణలో నిలిచిన నీరు



నడకదారి ఇలా.

గుంతల గండం..

నగరంలోని పలు ప్రధాన రహదారులు గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కాకినాడ శ్రీనగర్, శాంతినగర్, కల్పన కూడలి, భానుగుడి వంతెన దిగువన, గాటీ సెంటర్, నరసింహారోడ్డు, జగన్నాథపురం కొంతవంతెన తదితర ప్రధాన రహదారులపై పలుచోట్ల గుంతలు పడ్డాయి. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారులపై వేలసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతకొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని, వర్షాలు పడే సమయంలో గుంతల్లో నీరు నిలిచి పడిపోతున్నామని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి సమస్య పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్



శ్రీనగర్ ప్రధాన రహదారి



శాంతినగర్ ప్రధాన రహదారి

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం



మహిళలతో కలిసి బోనాలు తెస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బోనాల సంబరం

పిఠాపురం: పిఠాపురంలోని మోహన్‌నగర్, సినిమాసెంటర్‌లోని ఆటో యూనియన్ ప్రాంతాల్లో అమ్మవార్లకు మాజీ ఎమ్మెల్యే వర్మ బోనాలు సమర్పించారు. చిత్రాడ, జల్లూరు, కుమారపురం, గోకివాడ, భోగాపురం, మాధవపురంలో సంబరాలు జరిగాయి.

పంట నమోదు ఆలస్యంపై ఆగ్రహం

పిఠాపురం: ఏటా పంట నమోదు కార్యక్రమం ఎందుకు ఆలస్యమవుతోందని వ్యవసాయ అధికారులను జడ్పీ ఉపాధ్యక్షుడు బుర్రా అనుబాబు ప్రశ్నించారు. గురువారం పిఠాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అనుబాబు మాట్లాడుతూ పంట నమోదు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై సభ్యులు మండిపడ్డారు. ఎంపీడీవో చిన్నారావు, ఎంఈవో శ్యాంబాబు, ఏవో అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



మహాశక్తి యాగానికి తరలివస్తున్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న పండితులు

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక పరవశం

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠం వేల మంది భక్తులతో కిక్కిరిసింది. శరన్నవరాత్రుల్లో భాగంగా ఐశ్వర్యాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా కొలువయ్యారు. పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో మహాశక్తియాగం-2024 ఉత్సవాలు ప్రతి మదిలో ఆధ్యాత్మిక పరవశం నింపాయి. గురువారం మొదటిరోజు అమ్మవారి ఆలయ గోశాల ప్రాంగణం అష్టోత్తరనామాలతో ధ్వనించింది. హరిత సోదరీమణుల సంగీత కచేరీ అలరించింది. సుమారు 50 వేల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు 1200 మంది వాలంటీర్లు సేవలందించారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు, కృష్ణ, సునీల్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరిస్తారు.



గొల్లప్రోలు బస్టాండు వద్ద..



తాటిపర్తిలో శైలపుత్రిగా..



గ్రాంటులో దుర్గమ్మ



అమ్మవారికి పట్టువస్త్రాలందిస్తున్న జనసేన నేత శ్రీనివాస్



కొత్తపల్లి: గాదులదొడ్డిలో



పెద్దాపురం మున్సిపల్‌సెంటర్‌లో

దేవతామూర్తులకు అలంకార వైభవం

పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, తాళ్లరేవు, పెదపూడి, కరప, రమణయ్యపేట(సర్పవరంజంక్షన్), సామర్లకోట: గొల్లప్రోలులోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఆలయంలో విజయదుర్గమ్మ నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు. ప్రత్యేక దర్శనాలు కల్పించారు. కరణంగారితోట కనకదుర్గ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తాటిపర్తిలోని అపర్ణాదేవికి శైలపుత్రిగా పూజలు చేశారు. గ్రంధి రమేష్, ఆలేఖ్య దంపతులు కలశ స్థాపన పూజలు చేశారు. దుర్గాడ శివాలయంలో కలశస్థాపన చేశారు. ● కరపలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని విజయలక్ష్మి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నడకుదురు, పెనుగుదురు, వాకాడ, కొంగోడు, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, వేములవాడ, సిరిపురం, కూరాడ, జడ్.భావారం, అరట్లకట్ట, గురజనాపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ● కరకుదురు దుర్గాదేవి ఆలయం వద్ద అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. కొంగోడువారి వీధి రామాలయం వద్ద దుర్గా కమిటీ ఆధ్వర్యంలో, సంపర విజయదుర్గాదేవి ఆలయంలో అర్చకులు హనుమంతరావు పూజలు ప్రారంభించారు. ● గ్రామంలో పాలకసకదుర్గమ్మ ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన నిర్వహించారు. 120 మంది భవానీమాలలు ధరించారు. తూర్పుపేటలో మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ● పిఠాపురం పాదగయ క్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, ఈవో విశ్వనాథరాజు కలశ స్థాపన చేశారు. అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. పదో శక్తి పీఠం పురుహూతిక అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామివార్లకు అభిషేకాలు జరిపారు. ● చేబ్రోలులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. ఠాణా సెంటర్‌లో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దేవేంద్రుడు, లచ్చబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. ● పెద్దాపురంలో సినిమా సెంటర్, మున్సిపల్‌సెంటర్, రామారావుపేట, కొండయ్యపేట, ఆర్టీసీ బస్ స్టేషన్, కమ్మవారి వీధి తదితర ప్రాంతాల్లో దుర్గమ్మ విగ్రహాలను అలంకరించారు. కాండ్రకోటలో నూకాలమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. వర్ధ్యులవారివీధిలోని భవానీశ్వరి పీఠంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మరిడమ్మ అమ్మవారు గురువారం బాలాత్రిపురసుందరిగా కనిపించారు. దేవస్థాన సహాయ కమిషనర్ విజయలక్ష్మి, వేదపండితులు, ఆసాదులు పాల్గొన్నారు. ● రమణయ్యపేటలోని గోకుల్‌గార్డెన్ శ్రీకామాక్షి సమేత ఏకామ్రేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. ● సామర్లకోట కుమారారామ భీమేశ్వరాలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు. ఈవో నీలకంఠం పాల్గొన్నారు.



త్రిపురసుందరిగా మరిడమ్మ



గోకుల్‌గార్డెన్ శ్రీకామాక్షి అమ్మవారు



కరపలో విశేషాలంకరణలో కనకదుర్గాదేవి



పిఠాపురంలో రాజరాజేశ్వరి అలంకారం

విద్యుత్తుకు అంతరాయం నేడు

పెద్దాపురం, పెదపూడి: ఆనూరు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ప్రభాకర్ గురువారం తెలిపారు. ఆనూరు, కొండపల్లి, వాలుతిమ్మాపురం గ్రామాలవారు సహకరించాలని కోరారు. ● కరకుదురు గ్రామానికి శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

ఎస్సైగా మోహన్‌కుమార్

కాజులూరు: గొల్లపాలెం ఎస్సైగా మోహన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన తుల సీరామ్ కాకినాడ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్సై మోహన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు కాపాడేందుకు కృషిచేస్తామన్నారు.



ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

పెదపూడి: ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం పెదపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. సర్పంచి కృష్ణమూర్తి, ఉపసర్పంచి పెదపాత్రులు, నాయకులు పుట్ట గంగాధరరావు, మార్ని కాశీ, కార్యదర్శి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

డీజిల్ తరలిస్తున్న వాహనం సీజ్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా యానాం నుంచి జగ్గంపేటకు తరలిస్తున్న 2,400 లీటర్ల డీజిల్, వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. అక్కా చెరువు వద్ద కోరంగి ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో డీజిల్, వాహనాన్ని సీజ్ చేశారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

పిఠాపురం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పిఠాపురం రామా థియేటర్ సెంటర్‌లో కాంగ్రెస్, సీపీఐ నాయకులు గురువారం నిరసన తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమను ప్రైవేటీకరించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం దీనిని వ్యతిరేకించాలని కోరారు. రామకృష్ణ, గోపాలరెడ్డి, వీరబాబు, ప్రసాద్, సూరిబాబు పాల్గొన్నారు.

గుత్తేదారు చేతిలో భవనం.. పశువైద్యానికి అసౌకర్యం..!

– న్యూస్‌టుడే, కరప

పశువులకు వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్యశాలల్లో గత వైకాపా పాలనలో నిర్లక్ష్యంతో నేటికీ సమస్యలు వెంటాడుతున్నాయి. నిర్మాణానికి బిల్లులివ్వలేదని గ్రామీణ ప్రాంతంలో పశువైద్యశాల భవనానికి తాళం వేసి గుత్తేదారు భవనం అప్పగించని తీరు విస్మయం గొల్పుతోంది. కరప మండలం నడకుదురులోని పశువైద్యశాల శిథిలస్థితికి చేరడంతో అప్పటి ఎమ్మెల్యే కన్నబాబు నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. కొంత పనులు చేపట్టిన తర్వాత గుత్తేదారు బిల్లులు రావడం లేదని ముఖం చాటేయడంతో చాలారోజులు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో పాత టెండర్‌ను రద్దుచేసి రెండోసారి మార్కెట్ కమిటీ నిధులు రూ.14.97 లక్షలు మంజూరుచేసి వేరే గుత్తేదారుకు పనులు అప్పగించారు. చిన్నచిన్న పనులు మినహా ఈ భవన నిర్మాణం పూర్తవడంతో ఎన్నికల నియమావళికి రెండు రోజుల ముందు కన్నబాబు చేతుల మీదుగా గత మార్చి నెలలో ప్రారంభోత్సవం కూడా చేశారు. భవనాన్ని నిర్మించిన గుత్తేదారు తనకు బిల్లులు రాలేదని, దానిని అక్కడి వైద్యసిబ్బందికి అప్పగించడంలేదని పాడి రైతులు వాపోతున్నారు. దీంతో చిన్న రేకులషెడ్డులోనే వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నడకుదురులో నిర్మాణం పూర్తయినా.. వినియోగంలోకి రాని భవనం

చర్యలు తీసుకుంటాం

నడకుదురులో నిర్మించిన పశువైద్యశాలలో విద్యుత్తు వైరింగ్, పెయింటింగ్ వంటి చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. వీటిని త్వరితగతిన పూర్తి చేయించి పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. - పి.వెంకటేశ్వరరావు, డీఈ, ఏఎంసీ, కరప

సమస్యలపై గ్రామస్థుల నిరసన

కొత్తపల్లి: కొత్తపల్లిలో సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తపల్లి సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు, నూతనంగా వివాహమైనవారికి రేషన్‌కార్డులు, ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరుతూ కార్యదర్శి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. సత్యనారాయణ, అప్పలరాజు, లోవకుమారి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



బేతాళస్వామి గ్రామోత్సవం

సామర్లకోట గ్రామీణం: వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో స్వామివారి నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 9 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు గ్రామోత్సవం నిర్వహించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



నిరసన దీక్షలో యూటీఎఫ్ నాయకులు

పిఠాపురం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ పట్టణాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు కోరారు. గురువారం పిఠాపురం ఓబీఎస్ పాఠశాల వద్ద నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పరిధిలో నున్న పీఎఫ్ ఖాతాలను జీపీఎఫ్ ఖాతాలుగా మార్చి నిధులను బదిలీ చేయాలన్నారు. పాఠశాల పోస్టుల అప్‌గ్రేడ్ సమస్యపై దృష్టి సారించాలన్నారు. హెచ్ఎంలలో అర్హులను అర్బన్ ఎంఈవోలుగా నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ప్రారంభించాలని, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలన్నారు. శ్రీనివాస్, వెంకట్, పాములయ్య, శ్రీను, శర్మ, శ్రీనివాస్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ శుభ్రతకు యంత్రాలు

సామర్లకోట: స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా సామర్లకోట రైల్వేస్టేషన్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అధునాతన యంత్రాలను సిబ్బందికి గురువారం స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో అందజేశారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: రాయవరం రోడ్డులోని ప్రధాన డ్రెయిన్‌లో మురుగునీరు నిలిచిపోయింది. దుర్వాసన భరించలేకున్నాం. **- స్థానికులు**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్‌కు తెలుపగా స్పందించారు. పనులను పారిశుద్ధ్య సిబ్బందితో చేపట్టారు.

సమస్య: సత్తిరెడ్డిపేటలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఆ ప్రాంతం అధ్వానంగా ఉంది. **- సత్యనారాయణ, పెద్దాపురం**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో కాలువలు శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం. **- కేవీ పద్మావతి, పురపాలిక కమిషనర్**

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: వలసపాకల-వాకలపూడి ప్రధాన రహదారిపై గుంత ఏర్పడడంతో రాత్రిళ్లు వాహనదారులు పడిపోతున్నారు. **- ఆనందకుమార్**

సమాధానం: పైపులైన్‌కు మరమ్మతులు చేయించాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. **- మూర్తి, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

సమస్య: శివాలయకాలనీ ఎదురుగా రోడ్డుపై చెత్త పేరుకుపోయి పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- జి.సురేష్, గొల్లప్రోలు**

సమాధానం: శివాలయకాలనీ సమీపంలో రోడ్డుపై చెత్తను తొలగించే పనులు చేపడతాం. **- రఘుప్రసాద్, పర్యవేక్షణాధికారి**

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

స్పందనకు వందనం

పెద్దాపురం పట్టణంలోని రామారావుపేట, వరహాలయ్యపేటలో రహదారుల పక్కనున్న పిచ్చిమొక్కలు తొలగించారు. గత నెల 26న 'పిచ్చి మొక్కలతో సమస్య' ఈ నెల 2న సర్వారాయకాలనీలో 'పిచ్చిమొక్కలు తొలగించండి' శీర్షికలతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు పురపాలిక అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో వాటిని తొలగించారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

ధర్మయుగ స్థాపన దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు

తాళ్లరేవు: లహరికృష్ణ భక్తులు అనుసరిస్తున్న శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎస్‌పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహారావు అన్నారు. జార్జిపేట మనుజ్యోతి ఆశ్రమంలో 37వ ధర్మయుగ స్థాపన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరి ఆలయ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవంలో రామస్వామి



దుర్గామల్లేశ్వరి అమ్మవారు

సామర్లకోట: సాయినగర్‌లో గొల్లపల్లి సత్యనారాయణ స్ఫూర్తితో గొల్లపల్లి సూర్యావతి రూ.20 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, తెదేపా పట్టణాధ్యక్షుడు అడబాల కుమారస్వామి గురువారం ప్రారంభించారు. శ్రీకాంత్, రవిచంద్రప్రసాద్, శ్రీనివాసు, దొరబాబు, సరోజవాసు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరంపై పోలీసుల దాడి

కొత్తపల్లి: బీచ్‌రోడ్డు శివారులో సారా స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. గోర్స వాసి శివశ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

సేవలకు తగిన గుర్తింపు

సామర్లకోట: చిన్న వయసులో పేదలకోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న 'సామర్లకోట యువత' సంస్థ వ్యవస్థాపకుడు దేవగురు చంద్రశేఖర్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి చంద్రశేఖర్‌ను సత్కరించారు. సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు సరోజ వాసు, తమ్మల ప్రసాద్, మడగల శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష



సామర్లకోట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని యూటీఎఫ్ నాయకులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించారు. సామర్లకోట పట్టణ యూటీఎఫ్‌శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నగేష్ హాజరయ్యారు. ఉద్యోగోన్నతులు, బదిలీలపై మాట్లాడారు. ఎంఈవో శివరామకృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. గిరిధర్‌గోపాల్, వీరమణి, రాజా, శ్రీనివాసు, సయ్యద్ సైపుల్లా, నాగేశ్వరరావు, గోవిందు, కృష్ణవేణి, పద్మశ్రీ, జగతి, శేఖరం, బ్రహ్మానందం, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. సాగదీత!

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గొల్లప్రోలు పురపాలిక హోదాతో నగర పంచాయతీగా ఉన్నతీకరణ చెందినా పంచాయతీ కాలం నాటి పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కాక అధ్వానంగా కనిపిస్తోంది. చెత్త సమస్యను పరిష్కరించేందుకు వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా 2022లో ప్రారంభించినప్పట్నుంచి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగానే మిగిలాయి. ఎరువు తయారీ లేదు. ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు వేరుచేసి విక్రయించి ఆదాయం పొందడమూ లేదు. మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తుప్పలు పెరుగుతున్నాయి. స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా ఎస్సీకాలనీకి వెళ్లే మార్గంలో కేంద్రం గుంతలు చెత్తతో మూసుకుపోయాయి. చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వీటి గురించి అడుగగా ప్లాంట్లు పనిచేసేలా చర్యలు చేపడతామని ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రఘుప్రసాద్ తెలిపారు.



మార్కెట్ సమీపంలో తుప్పలతో అధ్వానంగా ప్లాంటు



చెత్తతో మూసుకుపోయిన ఎస్సీకాలనీ దారి

తుప్పలు తొలగించాలి



పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు రహదారి ఇరువైపులా తుప్పలు పేరుకుపోయాయి. ఆ మార్గంలో రెండు వాహనాలు తప్పుకొనే అవకాశం లేకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకట రమణను వివరణ కోరగా రెండు రోజుల్లో తుప్పలను తొలగించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

జగనన్నకాలనీ.. ఎలా వెళ్లాలనీ..!



గొల్లప్రోలు జగనన్నకాలనీ మార్గంలో సుద్దగెడ్డ వరద నీరు గురువారం తెల్లవారుజాము నుంచి ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతోపాటు ఎగువ నుంచి భారీగా నీరు సుద్దగెడ్డలో చేరడంతో వరదగా మారింది. దాంతో జగనన్నకాలనీ మార్గంలో ఈ ఏడాది అయిదోసారి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గత ప్రభుత్వం సరైన రహదారి నిర్మించకపోవడంతో ప్రతిసారీ ఇలానే యాతన తప్పడం లేదని, చేసేదిలేక పంట పొలాల మీదుగా జగనన్నకాలనీకి రాకపోకలు సాగించాల్సివస్తోందని వాపోతున్నారు. గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే మార్గంలోనూ నీటిలోంచే రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పవన్ దీక్షకు మద్దతుగా పూజలు


యర్రవరంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న కూటమి నాయకులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తిరుపతి లడ్డూ అపవిత్రమైందంటూ జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన దీక్షకు మద్దతుగా యర్రవరంలో కూటమి నాయకులు గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నాయకులు భజనలు చేసి భక్తి గీతాలను ఆలపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు, తెదేపా నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, భాజపా నాయకుడు గట్టెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అన్నవరం ఎస్సైగా శ్రీహరిబాబు

శంఖవరం, న్యూస్‌టుడే: అన్నవరం ఎస్సైగా జి.శ్రీహరిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నల్లజర్ల నుంచి సాధారణ బదిలీపై ఇక్కడకు రాగా ఇప్పటి వరకు పనిచేసిన ఎస్సై కిశోర్ కాకినాడ వీఆర్‌లో ఉంచారు. అనంతరం కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఎస్పీ కార్యాలయంలో, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు మెచ్చేలా పోలీసులు సేవలందించాలని ఎమ్మెల్యే ఎస్సై శ్రీహరిబాబుకు సూచించారు.


జిల్లా ఎస్పీని కలిసిన అన్నవరం ఎస్సై

దేవీ వైభవం

✦ బోనాలు.. ఊరేగింపులు

న్యూస్‌టుడే బృందం: గ్రామాలన్నీ శరన్నవరాత్రుల శోభను సంతరించుకున్నాయి. ప్రత్తిపాడులోని పంచాయతీ సమీపంలోని విజయదుర్గమ్మకు భారీ సంఖ్యలో భక్తజనం బోనాలు సమర్పించారు. భవానీ మాలధారులతో ప్రతి గ్రామంలోనూ సందడి నెలకొంది. రాచపల్లి శ్రీఅరుణాచలేశ్వరక్షేత్రంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా కొలిచారు. ● కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ, ఆశ్రమ వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్.సూరవరంలో కొలువుదీరిన కనకదుర్గ ఆలయంలో భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించి సమర్పించారు. లోవకొత్తూరు, రేఖవానిపాలెం, డి.పోలవరం, ఎస్.అన్నవరం, తేటగుంట గ్రామాల్లో దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక పందిళ్లు వేసి అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ● సీతంపేటలోని దుర్గామీనాక్షి అమ్మవారు బాలత్రిపుర సుందరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● తొండంగి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ● తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మాజీ మంత్రి యనమల అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ● ఏలేశ్వరంలోని సంతోషి నగర్‌లో కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ● జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురు సోమాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారిని అలంకరించారు. ● జగపతి నగరంలోని అభయ దుర్గాదేవి ఆలయంలో, కిర్లంపూడిలో కల్యాణ మండపంలోని వాసవి మాత ఆలయంలో శరన్నవరాత్రి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ● జె.కొత్తూరులో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశామని ఆలయ కమిటీ తెలిపారు. శుక్రవారం నుంచి దసరా వరకు నిత్యాన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ● తుని పట్టణం బెల్లపువీధిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. పాతబజారులోని శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.




శంఖవరం: బాలాత్రిపురసుందరిగా సీతంపేటలోని దుర్గామీనాక్షి, జగపతి నగరంలోని అభయ దుర్గాదేవి, జె.కొత్తూరులో కనకదుర్గమ్మ


ఏలేశ్వరం సంతోషినగర్‌లో...


స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా సోమాలమ్మ


ప్రత్తిపాడులో బోనాలతో భక్తులు


తపోవనంలో అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీ, వేదపండితులు

వీధిలైట్లకు మరమ్మతులు



జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సీతారాంపురంలో వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గ్రామ సర్పంచి విష్ణుమూర్తికి తెలియజేయగా వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టారు. పలుచోట్ల కొత్తలైట్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

5, 6 తేదీల్లో బస్‌పాస్‌ల జారీ ఉండదు

ఏలేశ్వరం: సాఫ్ట్‌వేర్‌లో చేస్తున్న మార్పుల కారణంగా ఈ నెల 5, 6 తేదీల్లో ఏలేశ్వరం బస్ పాసుల జారీ చేసే కౌంటర్ పనిచేయదని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ చెప్పారు. డిపో పరిధిలో విద్యార్థులు, ఉద్యోగులు, దివ్యాంగులకు బస్‌పాస్‌లు ఇచ్చే అవకాశం లేదని ఆయన తెలిపారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు



తుని, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక రకాల సామగ్రి అందక ఎంతోకాలం తీవ్ర ఇబ్బందులు పడిన దివ్యాంగులకు మంచి జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు 6న పురపాలక సంఘ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సదరమ్ క్యాంపు నిర్వహించారు. దీనిలో వైకల్యం ఉన్నవారికి ఎలాంటి పరికరాలు, వాహనాలు, వస్తువులు అవసరమో అనేది గుర్తించారు. దీనికి తగ్గట్లుగా ప్రభుత్వం నెలరోజులు కూడా పూర్తికాకుండానే బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు 28, వీల్‌ఛైర్లు 74, చేతి, సంక కర్రలు 142 సమకూర్చారు. కంటిచూపులేని వారు ఉపయోగించే కర్రలు 18, స్మార్ట్‌ఫోన్లు 3, చెవిటి మిషన్లు 84, మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు ఉపయోగపడే కిట్లు 5 వచ్చాయి. ఇవి అన్ని రూ.లక్షలు విలువచేసే సామగ్రి పురపాలక కార్యాలయానికి చేరాయి. వీటిని త్వరలోనే లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఊరెళుతున్నారా.. జర జాగ్రత్త!

● సెలవుల సరదా కాకూడదు విషాదం

న్యూస్‌టుడే – తుని, తుని పట్టణం

దసరా సెలవులొచ్చాయి. ఓవైపు చిన్నాపెద్దా సంతోషంగా సొంతూళ్లకు బయల్దేరుతున్నారు. మరికొందరు బంధుమిత్రులతో విహార, తీర్థయాత్రల బాట పట్టారు. ఇదిలావుంటే.. మరోవైపు రైళ్లు, బస్సులు ఖాళీ లేకుండా కిక్కిరిసి ఉంటున్నాయి. దీంతో ఎవరికి వారే ఆటోలు, వ్యానులు వంటి ప్రైవేటు వాహనాలలో ఆయా ప్రాంతాలకు వెళుతున్నారు. ఇంకొందరైతే ద్విచక్ర వాహనాలపైనే పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు జరిగి సరదాల వేళ తీవ్ర విషాదం మిగులుతోంది. ఎలాంటి విషాదం చోటుచేసుకోకుండా పోలీసుల సూచనలు పాటిస్తే మంచిది.

ఇటీవల విషాదం మిగిల్చిన కొన్ని ఘటనలు..

● గర్ల్స్ హైస్కూలు సెంటర్‌కు చెందిన యువకుడు గణేష్ నిమజ్జనానికి వెళ్లి ప్రమాదశాత్తూ తాండవలో మునిగి చనిపోయాడు.

● బాలాజీరోడ్డులోని ఓ ఇంట్లో విద్యుదాఘాతంతో వివిధ రకాల విలువైన వస్తుసామగ్రి అగ్నికి ఆహుతి కావడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

● తొండంగి మండలం బెండపూడిలో తాళం వేసి ఊరికి వెళ్లిన ఇంట్లో దుండగులు చొరబడి రూ.లక్షలు విలువైన ఆభరణాలు ఎత్తుకుపోయారు.


అడ్డదిడ్డంగా రోడ్డు దాటుతూ.., కొద్ది దూరంలో బైక్‌పై ముగ్గురు యువకులు

ఇలా జాగ్రత్తలు తీసుకోవాలి..

▲ ఎక్కువ రోజులు ఊరెళ్లాల్సి వస్తే.. ఎలక్ట్రానిక్ పరికరాలు ఫ్రిజ్, ఏసీ, వాషింగ్ మెషీన్, ఛార్జర్లు వంటివి ప్లగ్‌ల నుంచి తీసేయాలి.

▲ గ్యాస్ రెగ్యులేటర్ కట్టేయడంతోపాటు, వీలైతే సిలిండర్ నుంచి వేరుచేస్తే మంచిది.

▲ ఇళ్లల్లో కిరోసిన్, పెట్రోలు, డీజిల్, బాణాసంచా వంటివి లేకుండా చూసుకోవాలి.

▲ సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్లలో ఆభరణాలు, నగదు భద్రపరుచుకోవడం ఉత్తమం.

అప్రమత్తత అవసరం

❖ జలపాతాల వద్దకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. కొండకోనల్లో కురిసిన భారీ వర్షాల వరద నీరు ఒక్కసారిగా నదులు, జలపాతాల్లోకి వచ్చి జనం కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంటుంది.

❖ బీచ్‌ల వద్ద ఎట్టి పరిస్థితుల్లోను లోతైన, నిర్జన ప్రదేశాల్లో స్నానాలకు దిగకూడదు.

❖ జంతుప్రదర్శన శాలల్లోను జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు సెల్ఫీల కోసం ప్రయత్నించి ప్రమాదానికి గురవుతుంటారు.

ప్రయాణాల్లో ఇలా..

✦ కిక్కిరిసిన బస్సులు, రైళ్లల్లో ఎక్కి గేటు వద్ద కూర్చోవడం, నిల్చోవడం చేయకూడదు. మెడలో విలువైన ఆభరణాలు వేసుకుని కిటికీల వద్ద కూర్చోకూడదు.

✦ అపరిచితులు ఇచ్చే తినుబండారాలు తీసుకోకూడదు. ఎవరికీ తమ సామగ్రి అప్పగించి టాయిలెట్, రైలు దిగి ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లొద్దు.

✦ గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలించే ముఠా ప్రయాణించే అవకాశాలు ఉండటంతో ఎవరి లగేజీ చూసే బాధ్యత తీసుకోకూడదు.

✦ పరిమితికి మించి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల్లో ప్రయాణించొద్దు. ✦ సామగ్రి తరలించే వ్యాన్లు, ట్రాక్టర్లు, తొట్టి ఆటోలు వంటి వాటిలో ప్రయాణం ప్రమాదకరం.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వాహనాల్లో పరిమితికి మించి ఎక్కి ప్రయాణించడం నేరం. అంతేకాకుండా మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోను వాహనాలు నడపకూడదు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలి. కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

\- చెన్నకేశవరావు, సీఐ, తుని రూరల్

రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: రాత్రి సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు అన్నారు. బెండపూడిలో ఇటీవల చోరీలు జరగడంతో గురువారం గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. దసరా సెలవుల నేపథ్యంలో ఊర్లు వెళ్లేవారు ఇంటి వద్ద నగలు, నగదు లేకుండా చూసుకోవాలన్నారు. ఎస్సై జగన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

వారాహి సభకు డిజిటల్ తెర ఏర్పాటు

జగ్గంపేట, న్యూస్‌టుడే: తిరుపతిలో జరిగే డిప్యూటీ సీఎం వారాహి సభ లైవ్‌ను నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ జగ్గంపేట సెంటర్‌లో డిజిటల్ తెర ఏర్పాటు చేశారు. తిరుమల లడ్డూ అపవిత్రతపై 11 రోజులు దీక్ష చేసిన అనంతరం పవన్ గురువారం రాత్రి తిరుపతిలో వారాహి బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లైవ్ ప్రజలు వీక్షించే విధంగా డిజిటల్ లైవ్‌ను ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.


తిరుపతిలోని వారాహి సభను లైవ్‌లో వీక్షిస్తున్న స్థానికులు


ఏలేశ్వరంలో ఐకాస నాయకుల ఆందోళన

ఆర్టీసీ డీఎం వైఖరిపై కార్మికుల ఆగ్రహం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరితో కార్మికుల్లో అశాంతి ఏర్పడిందని స్థానిక ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి యూబీఎం కుమార్ అన్నారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు విరుద్ధంగా డీఎం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కార్మికులను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎంప్లాయీస్ యూనియన్, ఎన్‌ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఐకాసగా ఏర్పడి ప్రారంభించిన ఆందోళనలు గురువారం మూడో రోజుకి చేరుకున్నాయి. కండక్టర్ ఎస్.శ్రీనివాసరావుపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిపో గేట్ వద్ద ఎర్ర బ్యాడ్జీలను ధరించి కార్మికులు ధర్నా చేశారు. కండక్టర్ కోసం ఒకవైపు యూనియన్లతో సంప్రదింపులు జరుపుతూనే, మరోవైపు ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా చర్యలు తీసుకోవడం గర్హనీయమని ఐకాస నాయకులు కె.త్రిమూర్తులు, ఎన్‌పీ రావు, నానిబాబు ఆరోపించారు. తన నిర్ణయాన్ని డీఎం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని ఐకాస స్పష్టం చేసింది. జీపే రాజు, బీఆర్‌ఎల్ రావు, గ్యారేజీ చలం, కుమారి, లక్ష్మి తదితరులు నిరసనకు హాజరయ్యారు.

విద్యుత్తు ఉచ్చులతో కలవరం


సరుగుడు తోటల్లో వన్యప్రాణుల కోసం విద్యుత్తు ఉచ్చు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: వన్యప్రాణుల వేట కోసం విద్యుత్తు ఉచ్చులు ఊళ్లలో కలవరపెడుతున్నాయి. సరుగుడు తోటలు, చేలల్లోనూ విద్యుత్తు తీగలను అమర్చడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. శాంతిఆశ్రమం ఫీడర్ పరిధిలోని పలుచోట్ల ఈ ఉచ్చులను ఏర్పాటు చేసిన వాటిని రైతులు గుర్తించారు. వన్యప్రాణులను వేటాడేవారి చర్యల వల్ల తమ పొలాలకు, తోటలకు ఏ వేళలోనైనా వెళ్లడానికి భయం వేస్తోందని పలువురు రైతులు వాపోయారు. ఈ ఉచ్చులు ఏర్పాటు చేయకుండా నిఘా ఉంచాలని కోరుతున్నారు.

కరెంట్ సరఫరాకు అంతరాయం నేడు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు- ఒమ్మంగి మధ్య విద్యుత్తు తీగలపై చెట్లు తొలగించే పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నారు. ఒమ్మంగి, రాచపల్లి గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లకు సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యర్థాల లోడుతో ఉన్న వాహనం స్వాధీనం

తుని గ్రామీణం: కుళ్లిన మాంసం వ్యర్థాలను తీసుకొని వెళ్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. విశాఖపట్నం నుంచి ఇరిపాకకు కుళ్లిన మాంసం వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని తుని ఎఫ్‌డీవో సీహెచ్ ఉమామహేశ్వరరావు గురువారం లోవకొత్తూరు కూడలి వద్ద అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని నరేంద్రపట్నంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారీ, అమ్మకాలు చేస్తున్న వ్యక్తి వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సూచిక బోర్డులు లేక ప్రమాదాలు!



కిర్లంపూడి మండలంలోని సోమరాయణింపేట, బూరుగుపూడి గ్రామాల మధ్య ర.భ. రోడ్డులో పంటకాలువలను ఆనుకుని ఉన్న ఎస్ మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎదురెదురు వాహనాలు కనబడే పరిస్థితి లేక ఢీకొని పక్కనున్న పొలాల వెంబడి పడి క్షతగాత్రులవుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. దట్టంగా తుప్పలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక పోతున్నారు. తప్పించుకునేందుకు వీలు లేక కాలువలోకి దూసుకుపోయి తీవ్ర గాయాల పాలవుతున్నారు. ర.భ.శాఖ అధికారులు స్పందించి ఈ మలుపు వద్ద ప్రమాద సూచికలు తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటుచేసి, మలుపుల వద్ద రోడ్డు చెంతన పెరిగిన తుప్పలను తొలగించాలని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

జలమయమైన రహదారులు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి జగపతి నగరంలోని రహదారులు నీట మునిగాయి. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో కొత్తచెరువులోకి భారీగా నీరు చేరింది. చెరువు కళింగల నుంచి బయటకు వస్తుండడంతో ఆ నీరు జగపతి నగరం గ్రామంలోకి చేరి ముంపునకు గురిచేసింది. దీంతో ప్రత్తిపాడు నుంచి సామర్లకోట వెళ్ళే ర.భ. ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరింది. గ్రామస్థులు, చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారి వెంబడి రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడ్డారు. గ్రామంలోని పలు కాలనీల్లోని ఇళ్లల్లోకి ముంపునీరు చేరింది.



కూత కూస్తే.. పతకం పక్కా

● గల్లీ నుంచి రాష్ట్రస్థాయికి ప్రస్థానం


కబడ్డీ ఆడుతున్న బాలలు

గండేపల్లి (జగ్గంపేట),న్యూస్‌టుడే: అవకాశాలు కల్పించాలే గానీ గల్లీల నుంచే ఛాంపియన్లు తయారవుతారంటారు గ్రెగ్‌చాపెల్. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ప్రస్తుత పాఠశాల క్రీడల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జగ్గంపేట ప్రభుత్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు కబడ్డీలో మండల, నియోజకవర్గ స్థాయి క్రీడల్లో సత్తాచాటి, జిల్లా ఆపై రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కల్పిస్తే ఇంకా ఉన్నతంగా రాణించి, భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తారు.

పాఠశాలకు మంచి పేరు తెస్తా:

పేరు: ఎ.గంగాభవాని (8వ తరగతి)
క్రీడ: రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపిక
గెలుపొందిన క్రీడలు: మండల, నియోజకవర్గ కబడ్డీ క్రీడల్లో మొదటి స్థానం, జిల్లా స్థాయి క్రీడల్లో ఎంపిక. గతంలో చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా
లక్ష్యం: పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవడం.

ఒలింపిక్స్‌లో ఆడాలనేదే లక్ష్యం:

పేరు: ఎం. శ్యామ్, (10వ తరగతి)
ఎంపికైన క్రీడ: రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపిక
గెలుపొందిన క్రీడలు: మండల, నియోజకవర్గస్థాయిలో కబడ్డీ పోటీల్లో మొదటి స్థానం, గతంలో స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరులో జరిగిన సబ్ జూనియర్స్ పోటీల్లో ఆడా.
లక్ష్యం: ఒలింపిక్స్‌కి వెళ్లి మన రాష్ట్రం తరపున ఆడి మంచి పేరు తీసుకొస్తా

వర్షం తెచ్చిన తంటా..

ప్రత్తిపాడు: బుధవారం రాత్రి కురిసిన వర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి. ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం గోడలన్నీ చెమ్మదేరిపోయాయి. కార్యాలయభవనం కాలం చెల్లిందని దశాబ్దం క్రితమే ధ్రువీకరించినా పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. వర్షం కురిసిన పుడల్లా కార్యాలయంలో దస్త్రాలు, ఇతర సామగ్రికి ఇబ్బంది ఎదురవ్వకుండా ప్రయాస పడడం అనివార్యం అవుతోంది. అగ్నిమాపక కార్యాలయం ఆవరణంతా ముంపునకు గురయ్యింది. గతంలో ఉండే నీటి కాలువలు మూసుకుపోవడం, చెరువుకు వెళ్లే కాలువలు ఆక్రమణలకు గురవ్వడంతో ముంపు సమస్య తీవ్రంగా ఉంటోంది.

జోరందుకున్న వాగులు

మండలంలో కురిసిన వర్షం నీరు సుద్దగెడ్డకు పోటెత్తింది. దీంతో ప్రత్తిపాడు హైవే సమీపంలోనూ, లంపకలోవ దారిలోనూ వంతెనల వద్ద ప్రవాహజోరు కొనసాగింది. మండలంలోని 15 చెరువులు పొర్లుపడ్డాయి. 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందని అధికార్లు తెలిపారు.


అగ్నిమాపక కేంద్రం ముందు ముంపు

వాణిజ్య పంటలకు ప్రత్యేక రాయితీలు

తుని గ్రామీణం: వాణిజ్యపంటలు సాగుచేసే రైతులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. దొండవాకలో గురువారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పట్టు పురుగుల పెంపకానికి రైతులకు అదనపు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: ఎరువుల యాజమాన్యం పాటిస్తేనే పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ బుల్లిబాబు అన్నారు. కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. దేశలింక వెంకటరమణ, కంచిబోయిన శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధితకుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా నాయకుడు తూము కుమార్ తండ్రి అప్పలరాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కుమార్ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జిల్లా తెదేపా సమన్వయ కర్త తోట నవీన్, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, మండల తెదేపా అధ్యక్షుడు చదరం చంటిబాబు, గోకాడ రాంబాబు, జగపతి నగరం సర్పంచి మహేంద్రాడ శ్రీలత, తెదేపా నాయకులు కుర్ల చిన్నబాబు, గుడాల రాంబాబు, కాళ్ళ వెంకటేష్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు కుమార్, ఆయన సోదరుడు శ్రీరామూర్తిని పరామర్శించి సంతాపం తెలియజేశారు.

ఏలేశ్వరం.. ఎటూ చూసినా చెత్త..!


పట్టణం నుంచి లింగంపర్తి వెళ్లే రహదారిపై డంపర్ వద్ద దుస్థితి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : నగర పంచాయతీ ఏలేశ్వరంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండడంతో 30 వేల జనాభా ఉన్న పట్టణంలో రోజూ ఇబ్బందే. 20 వార్డుల్లో నిత్యం చెత్త సేకరణ కష్టంగా ఉంటోంది. స్థానికంగా పలు ప్రాంతాల్లో గురువారం కనిపించిన దృశ్యాలివీ..

కాలువల నిండా వ్యర్థాలే..

ఏలేశ్వరం ప్రధాన రహదారిని ఆనుకుని మూడు కి.మీ. పొడవైన సాగునీటి కాలువలు ఉన్నాయి. ఇళ్ల యజమానులు, దుకాణాల నిర్వాహకులు ప్లాస్టిక్ సీసాలు, ఇతర వస్తువులను కాలువల్లో పడేస్తున్నారు. ఒక సారి వినియోగించి పారేసే ప్లాస్టిక్‌తో కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పట్టణ శివారున ఉన్న తిమ్మరాజు చెరువు నుంచి విడుదల చేసే నీరు ఈ కాలువల నుంచి పొలాలకు చేరాలి. కాని ఎక్కడికక్కడ వ్యర్థాలు నిలిచిపోవడంతో పంటలకు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు గొల్లుమంటున్నారు. అధికారులు స్పందించి కాలువలను రోజూ శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు.


ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

రహదారిపైకి చేరుతున్న చెత్త.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త వేసేందుకు డంపర్లు ఏర్పాటుచేశారు. కొన్ని సందర్భాల్లో చెత్తతో ఇవి నిండిపోతున్నా సిబ్బంది ఖాళీ చేయడం లేదు. దీంతో చెత్త రహదారులపైకి చేరుతోంది. అసలే అస్తవ్యస్తంగా ఉన్న పారిశుద్ధ్యాన్ని పందులు మరింత దుర్భరం చేస్తున్నాయి. కాలువల పూడిక తీయకపోవడంతో చెత్తతో నిండిపోతున్నాయి. నిత్యం చెత్తను డంపింగ్ యార్డుకి తరలించే పనులు చేపట్టాలని పట్టణ ప్రజానీకం కోరుతోంది.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

పట్టణంలో రోజూ చెత్తను తరలించే పనులు చేపడుతున్నాం. సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. అదనపు సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయిస్తున్నాం. ఏలేశ్వరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పనుల నిర్వహణకు ప్రాధాన్యమిస్తాం.

\- ఎం.సత్యనారాయణ, కమిషనర్, నగర పంచాయతీ, ఏలేశ్వరం

డిజిటల్ అసిస్టెంట్‌కు సత్కారం

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని రామవరం-2 డిజిటల్ అసిస్టెంట్ కాపగంటి సంతోష్ కుమార్‌ను గ్రామస్థులు గురువారం ఘనంగా సత్కరించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి గ్రామంలో పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించారని స్థానికులు కొనియాడారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి వత్సవాయి ఛాయాదేవి, సత్యనారాయణరాజు, జనసైనికులు మొగలి గంగాధర్, దొడ్డా శ్రీను పాల్గొన్నారు.


సంతోష్ కుమార్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు